

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ని సత్కరించిన నూనె



**నెల్లూరు, జూన్16 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను మంగళవారం డిల్లీలో జనసేనపార్టీ జిల్లా నేత నూనె మల్లిఖార్జున యాదవ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూనె పవన్ కళ్యాణ్‌కి పుష్పగుచ్చాలు అందించి, శాలువాలతో ఘనంగాసత్కరించారు. అనంతరం జిల్లాలో పార్టీ స్థితిగతులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, స్థానిక సంస్థల ఎన్నికలు, వ్యూహాలు, తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత నూనె రుషి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్16,ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 1709క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 41.702టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎస్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 2200 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం94.570 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నేడు స్వర్ణాల చెరువు ట్యాంక్ బండ్ వద్ద సామూహిక యోగా

**- నగర ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలి- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త - కలెక్టరేట్** నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ట్యాంక్‌బండ్ వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద బుధవారం సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మానసిక ఆనందానికి, శారీరక దృఢత్వానికి యోగా ఒక దివ్యౌషధమని కలెక్టర్ పేర్కొన్నారు. నగర ప్రజలందరూ ఈ సామూహిక యోగా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని యోగాపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## బీసీల ద్రోహి జగన్..

**- గొడ్డలి పార్టీ ఆధ్వర్యంలో బీసిలు అణచి వేతకు గురయ్యారు**
**- మరచిపోలేని విషాదం- అమర్నాథ్ గౌడ్ ఘటన**
**- తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య**



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త** గత ఐదేళ్ల పాలనలో గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిందని, జగన్మోహన్ రెడ్డి బీసీలకు తీరని ద్రోహం చేశారని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య అన్నారు. నెల్లూరులోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కార్యాయలంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు కేవి శేషయ్య, ఎద్దలపూడి నాగరాజు, ఆవుల వాసు, రవిచంద్ర, శ్రీకాంత్ గౌడ్ , వావిళ్ల బాస్కర్‌లతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. రేపల్లె నియోజకవర్గంలో అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి పిల్లాడిని వైసీపీ నేతల ప్రోద్బలంతో కొందరు యువకులు పెట్రోల్ పోసి తగులబెట్టి చంపేశారన్నారు. ఈ దారుణమైన సంఘటనకు నేటికి మూడేళ్లు (2023 జూన్) పూర్తి అయ్యాయన్నారు. గత గొడ్డలి పార్టీ పాలనలో ఒకటి కాదు.. రెండు కాదు.. లెక్కలేనన్ని దారుణాలు జరిగాయన్నారు. బీసీలకు అండగా ఉన్నామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం, అదే బీసీ కుటుంబానికి న్యాయం అందించడంలో ఎందుకు విఫలమైందో సమాధానం చెప్పాలన్నారు. అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అండగా నిలివడమే కాకుండా బాధితులకు ధైర్యాన్ని కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బాధితులకు న్యాయం, నేరస్తులకు శిక్ష అనే విధానంతో ముందుకు వెళ్తుందన్నారు. అమర్నాథ్ గౌడ్ లాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. నేరస్తులకు భయం పుట్టించేలా పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ సందర్భంగా బీసీ సామాజిక వర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు కేవీ శేషయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీల పైన జరిగిన దాడులు, బడుగు బలహీన వర్గాల మీద వైసిపి నాయకులు చేసిన పైశాచికత్వంతో బహుమానంగా రాష్ట్రంలో 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. అమర్నాథ్ గౌడ్ ఘటన ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదని, అప్పటి గొడ్డలి పార్టీ హయాంలో శాంతి భద్రతలు ఎలా పడకేశాయో తెలిపే నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అబ్దుల్ అజీజ్ కు యావత్ ముస్లిం సమాజం తోడుగా ఉంటుంది

**- దీక్ష చరిత్రలో లేని విధంగా కార్యక్రమాన్ని నిర్వహించి, పేదలపై చూపిన చొరవ వెలకట్టలేనిది**
**- ధనవంతులు మాత్రమే చదవగలిగే కళాశాలలో పేదలను చేర్పించారు**
**- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్**



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త - వైద్యం** ఏపీ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తాలీం ఏ హునర్ విజయవంతం కావడంతో ముస్లిం మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు హమీద్, అల్తాఫ్‌లు మాట్లాడుతూ దాదాపు 7వేల మంది పరీక్ష రాస్తే అందులో మెరిట్ ఆధారంగా 200 మందిని ఎంపిక చేసి కార్పొరేట్ కళాశాలలో చేర్పించారని అన్నారు. దేశ చరిత్రలో లేనివిధంగా కార్యక్రమాన్ని నిర్వహించి పేద విద్యార్థులపై ఆయన చూపిన చొరవ వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ధనవంతులు మాత్రమే చదవగలిగే కళాశాలలో వారిని చేర్పించారని కొనియాడారు. పక్క రాష్ట్రాల్లో సైతం దీనిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వచ్చి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నారని అన్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తికి యావత్ ముస్లిం సమాజం తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు : ఎమ్మెల్యే



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** రాష్ట్రంలో మహిళల రాజకీయ సాధికారతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తుంటే ఒక హోం మంత్రిగా పనిచేస్తున్న మహిళపై వైసీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత నీచమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. వీపీఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబులు 33 శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర హోం మంత్రిగా ఎదిగిన వంగలపూడి అనితపై వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోలేక వ్యక్తిగత అంశాలు, దుస్తులు, మేకప్ వంటి విషయాలను ప్రస్తావించడం మంచిది కాదన్నారు. రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ తల్లి చెల్లి భార్య వంటి మహిళా బంధువులు ఉంటారని, ఇటువంటి పరిస్థితుల్లో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. రాజకీయ నాయకుల విధానాలు, నిర్ణయాలపై విమర్శలు చేయవచ్చు గానీ, వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్ర హోం మంత్రి హోదాలో ఉన్న ఒక దళిత మహిళ ఆత్మ విశ్వాసంతో గౌరవప్రదంగా ఉండకూడదా అని ప్రశ్నించారు. సాధారణ కుటుంబం నుంచి ఉపాధ్యాయినిగా ఉద్యోగం ప్రారంభించి కష్టపడి హోం మంత్రి స్థాయికి చేరుకున్న అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఆయా పార్టీల నాయకత్వం నియంత్రించాలన్నారు. జిల్లాలో కోవూరు నియోజకవర్గం నుంచి 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పెద్ద కుటుంబం అని గొప్పలు చెప్పుకునే వారు గతంలో తమను ఎదుర్కోలేక తన గురించి కూడా మాట్లాడితే ఆ పార్టీ నాయకులు ఖండించకుండా ప్రోత్సహించారన్నారు. మహిళలను గౌరవించడం నేర్చుకుని తరువాతే రాజకీయాలు చేయాలని సూచించారు. ప్రస్తుతం పురుషుల కంటే మహిళల ఓట్ల సంఖ్య అధికంగా ఉందని, వారిని అవమానించే నాయకులను ప్రజలు సహించరని హెచ్చరించారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన నాయకులను ఒకసారి ఓడిస్తే తిరగి ఒక ఏ రాజకీయ నాయకుడు మహిళల గురించి మాట్లాడే ధైర్యం చేయరన్నారు.

# కూటమి పాలనలో
# అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు

**రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం**
**శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5000 గుళ్లలో భజనలు**
**- రూ. 808కోట్లతో 684 దేవాలయాల అభివృద్ధి**
**- రూ.73 కోట్ల 99 లక్షలతో 6,116 దేవాలయాలలో దీప దూప నైవేద్యం**
**- రూ.2500 కోట్లతో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు**
**- సోమశిల - కండలేరు రిజర్వాయర్ ద్వారా తొలి విడతగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం**
**- విజయోత్సవ సంబరాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి**





**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త - వైద్యం** కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు అని, రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నామని, అలాగే 808 కోట్ల రూపాయలతో 684దేవాలయాల అభివృద్ధి, పునః నిర్మాణం చేస్తున్నామని, మరో 73 కోట్ల 99 లక్షలతో 6,116 దేవాలయాలలో దీప,దూప నైవేద్యం పథకం, 2500 కోట్ల రూపాయలతో దత్తులూరులో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు చేశామని, సోమశిల కండలేరు రిజర్వాయర్ ద్వారా జిల్లా రైతాంగానికి తొలి విడతగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, మరో నాలుగు లక్షల ఎకరాలకు త్వరలో సాగునీరు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ విజయోత్సవ సంబరాలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా **మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి మాట్లాడుతూ** గత రెండేళ్లలో ప్రజలకు కల్పించిన నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేలా విజయోత్సవాలని నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో కలిసి ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం చివరనాటికి కోటి మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడమే లక్ష్యం ప్రభుత్వం ఉందన్నారు. అలాగే రాష్ట్రంలోనే 684 దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి 808 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలంలో అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడం జరుగుతున్నదని, అంతేకాకుండా రైతులకు మేలు చేసే విధంగా గత ప్రభుత్వం తెచ్చిన యాక్ట్‌ను రద్దు చేయడం జరిగిందని తెలిపారు.ఆ స్థానంలో మీ భూమి, మీహక్కు తీసుకురావడం జరిగిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిపేర్కొన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టం రద్దుచేసి రైతులు ముఖాలలో ఆనందం వెల్లివిరిసేలా రాజ ముద్రిక, క్యూఆర్ కోడ్‌తో మీ భూమి మీ హక్కు ను కల్పించే విధంగా పట్టాదారుకు పాస్ పుస్తకాలను అందిస్తున్నా మన్నారు. ఇప్పటివరకు 23 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. 6,700 గ్రామాలలో పట్టాదారు పాసు పుస్తకాలను సరి చేసే విధంగా ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. గతంలో లక్షలాది ఎకరాలు హరించే విధంగా కుట్రలు పన్నారని దానిని నివారించే ప్రయత్నం జరిగిందన్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి మీ భూమి, మీ హక్కు ద్వారా ఒక కోటి పట్టాదారు పాసు పుస్తకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 70 వేల పాసుపుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. సోమశిల కండలేరు రిజర్వాయర్ ద్వారా జిల్లాలో తొలి విడతగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని,రెండో విడతగా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఇది గతంలో ఎప్పుడూ లేని ప్రక్రియగా ఆయన కొనియాడారు. సోమశిల రిజర్వాయర్ ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కాలువలు, చెరువులలో పూడికతీత కార్యక్రమాలు చేపట్టడం జరగలేదని,రైతులకు లబ్ధి చేకూరే విధంగా సుమారు 393 లక్షల రూపాయల వ్యయంతో 4553 సాగునీటి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని, 16 వేలమంది ఉపాధ్యాయులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన, 6000 కానిస్టేబుల్ ఉద్యోగాలను ప్రత్యక్షంగా నియమించడం జరిగిందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి 24 గంటల్లోనే దాని సేకరణ జరిగి నిధులు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ చాలా చిన్నదని,అయినను దానిని ముందు వరుసలో నిలిపే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 684 దేవాలయాల అభివృద్ధి పునర్నిర్మాణానికి ఎనిమిది వందల ఎనిమిది కోట్ల రూపాయలను వెచ్చించడం జరుగుతున్నదని తెలిపారు. ధూప దీప నైవేద్యం కార్యక్రమం కింద 6,116 దేవాలయాలలో 73 కోట్ల 99 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతున్నదని, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5000 గుడిలలో భజనలు ఆలయాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం జరుగుతున్నదని సుమారుగా సంవత్సరానికి మూడు కోట్ల మందికి అన్న ప్రసాదం జరుగుతున్నదని తెలిపారు. నెల్లూరు జిల్లాలో అనేక దేవాలయాలలో ధూప దీప నైవేద్యానికై సుమారు ఆరు కోట్ల 35 లక్షల రూపాయలు నెలకు ఖర్చు చేయడం జరుగుతున్నదన్నారు. కామన్ గుడ్ ఫండ్ కింద 77 పనులకు గాను 129.45 కోట్ల అంచనాతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. సుమారు 18 దేవాలయాలలో నూతన కమిటీలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు రావడం ఆనందదాయకమని నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమని అన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కును రాష్ట్రంలోనే తొలిసారిగా ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందన్నారు. మెట్ట ప్రాంతాల అభివృద్ధి ఎంత అవసరమని ఆయన అన్నారు. నెల్లూరు సమగ్ర అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేయవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తిని గుర్తించడం జరిగిందన్నారు. అనంతరం పార్లమెంటు సభ్యులు **వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ** ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు తదుపరి మీ భూమి మీ హక్కు రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. రెండు సంవత్సరాలుగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే విధంగా విజయోత్సవాలు నిర్వహించుకోవడం గొప్ప విషయం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2001లో ముఖ్యమంత్రిగా పనిచేసే 2014 నుంచి నేటి వరకు 12 సంవత్సరాల పాటు దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసే విధంగా పనిచేశారని ఆయన కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక విజినరీ లీడర్ అని,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి డిస్టేయిన్ ఉన్న వ్యక్తి అని, నారా లోకేష్ బాబు డిసిప్లిన్, పట్టుదల గల వ్యక్తి అని వారి అడుగుజాడలలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ విజయవంతం అయిందని ఆయన తెలిపారు. అనంతరం నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ విధివిధానాలతో రాష్ట్రం చాలా నష్టపోయిందని ప్రధానమంత్రి మోడీ, నారా చంద్రబాబునాయుడుల కృషితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం జరుగుతున్నదని తెలిపారు. 12 సంవత్సరాలుగా శాసనసభ్యులుగా ఉన్నానని, పది సంవత్సరాలుగా చూడని అభివృద్ధి గత రెండు సంవత్సరాలలో చూడడం జరిగిందన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సుమారు 700 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేయడం సంతోషమని ఆయన వివరించారు. నియోజకవర్గంలో పరిశ్రమ అవసరం గురించి తెలియపరుస్తూ ఆమంచర్ల వద్ద 500 ఎకరాల స్థలం ఉన్నదని దానిని పారిశ్రామిక వాడుగా గుర్తించవలసిన అవసరం ఉందని తెలిపారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆమంచర్ల వద్ద 500 ఎకరాలలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. తదనంతరం **కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ** రెండు సంవత్సరాల నమ్మకం 12 సంవత్సరాల మోడీ పాలన అమోఘమన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పి నవన్నీ చేయడం జరి గిందని రెండు సంవత్సరం తర్వాత విజయోత్సవ సభ నిర్వహించడం జరిగిందని తెలిపారు.

సూపర్ సిక్స్ కార్యక్రమం విజయవంత మైందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా కుటుంబంలోని చదువుతున్న పిల్లలందరికీ మేలు జరిగేలా కృషి చేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పథకం విజయవంత మైందన్నారు. రైతుల అవసరాలను గుర్తించి అన్నదాత సుఖీభవ ద్వారా 20వేల రూపాయలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

2 పేజీలో

# యోగ ఆరోగ్యానికి బాట

**:నిత్య సాధనతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యం: కలెక్టర్, ఎమ్మెల్యే**





**విడవలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వారసత్వమైన యోగాను ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని రామతీర్థం బీచ్లో మంగళవారం నిర్వహించిన 'యోగాంధ్ర-2026 అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ యోగా కేవలం ఒక వ్యాయామ విధానంకాదని,అది భారతీయ సంస్కృతి, సనాతన జ్ఞానం, జీవన విధానానికి ప్రతీక అని అన్నారు. వేల ఏళ్ల క్రితం భారత ఋషులు ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక యోగా అని చెప్పారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడులు, అనారోగ్య సమస్యలకు యోగం సమర్థవంతమైన పరిష్కారమని పేర్కొన్నారు. రోజుకు 30 నుంచి 40 నిమిషాల పాటు యోగా చేయడం మంచిదని, అది సాధ్యం కాకపోయినా కనీసం ఐదు నిమి షా లైనా సాధన చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. బీపీ, మధుమేహం వంటి సమస్యలను నియంత్రించడంలో యోగా దోహదపడుతుందని, రోజూ కొద్దిసేపు ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని వివరించారు. యోగా ద్వారా భారతదేశం విశ్వానికిశాంతి,ఆరోగ్యం, సమతుల్య జీవన విధానాన్ని అందిస్తూ విశ్వగురుగా తన ప్రత్యేకతను చాటుతోందన్నారు. తక్కువ సమ యంలో కార్యక్రమాన్ని సమన్వయం చేసిన ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, అధికారులు, సిబ్బం దిని కలెక్టర్ అభినందించారు. అనంతరం ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లా డుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర 2026 కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యోగాకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం అరగంట పాటు యోగా చేయాలని, ఐదు నుంచి పది నిమిషాలు ధ్యానం చేయడం వల్ల సానుకూల దృక్పథం పెరు గుతుందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన యోగాను ప్రపంచ దేశాలు సైతం అనుసరిస్తున్నాయని, ప్రజలందరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం



రామతీర్థం సాగరతీరం వద్ద నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, ఐటీడీఏ పీవో శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి అలీ అస్గర్, జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీవో నగేష్ కుమారి, యోగా సాధకులు, స్థానిక ప్రజలు పాల్గొని యోగాసనాలు ఆచరించారు. యోగా గురువు డాక్టర్ స్వప్న యోగాసనాల ప్రత్యేకతను, వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ అందరితో యోగాభ్యాసం చేయించారు. సముద్ర కెరటాల మధుర నాదాలు, ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణం, భారీగా విచ్చేసిన యోగా సాధకుల ఆసనాలతో రామతీర్థం సాగరతీరం యోగా చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్రెడ్డి, దువ్వూరు కళ్యాణ్రెడ్డి, అచ్యుత్రెడ్డి, అడపాల శ్రీధర్రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు, చెముకుల కృష్ణచైతన్య, ఆవుల రవిచంద్ర, శ్రీహరికోట గోపి, రవిబాబు, చిన్నబాబు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యోగా సాధకులు పాల్గొన్నారు.



## యాదవ కులం పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి



**బిట్రగుంట జూన్ 16 ప్రభాతవార్త :** సోషల్ మీడియాలో యాదవ కులంపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన చిలకపాటి మధు పై చట్ట పరమైన చర్యలు తీసుకో వాలని బిట్రగుంట పోలీస్ స్టేషన్ మంగళవారం బోగోలు జడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన ఫిర్యాదు చేశారు. విచ్చలవిడిగా బహిరంగంగా సోషల్ మీడియాలో అసభ్యకరమైన, అవమానకరమైన పోస్టులు పెడుతూ యాదవ కులాన్ని టార్గెట్ చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోకపోతే చట్టపరంగా పోరాడతామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పద్మావతి, ఎబి కండ్రిక మాజీ సర్పంచ్ బత్తల శ్రీనివాసులు, కొండబిట్రగుంట దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబెర్ ఒట్టూరు మాల్యాద్రి, బీఎంర్ అభిమాని మద్దిబోయిన శేషాద్రి యాదవ్, బత్తల మహేంద్ర, ఆవుల రవి, పులి వెంకటేశ్వర్లు,గంగాడి మల్లికార్జున్ రావు, పులి వెంకయ్య, గోత్తల నాగేశ్వరావు, చిలకపాటి వెంకటేష్, చిలకపాటి రాజేష్, కుంచా యానాథయ్య, కొప్పోలు సురేష్, కొప్పోలు నరేష్ కుంచా తిరుమల రావు,గంగాడి మహేష్, నూకసాని మధు తదితర యాదవ యువకులు పాల్గొన్నారు.

## బిజెపి బిఎల్ఏ-1గా బెల్లింకొండ మాల్యాద్రి నియామకం



**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** కావాలి నియోజకవర్గ బిఎల్ఏ-1గా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జనతా వారిది జిల్లా కన్వీనర్ బెల్లంకొండ మాల్యాద్రి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీచేయడం జరిగింది. గత కొంతకాలంగా పార్టీ బలోపేతానికి సిద్ధాంతాల వ్యాప్తికి మాల్యాద్రి అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ బాధ్యతలను అప్పగించిందన్నారు.నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రా పరిధిలోని ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షించడంలోనూ క్షేత్రస్తాయిలో పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేయడంలోనూ బిఎల్ఏగా ఆయన కీలకపాత్ర పోషించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు వెలుతానని తెలిపారు. మాల్యాద్రి నియామకం పట్ల నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం తెలిపారు.

## 15వేలు అందజేసిన కావలి బ్రాహ్మణ మహాసంఘం



**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** కావలి బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో స్తానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం టి.ఉదయ్‌కుమార్ శర్మ అపరకర్మల నిమిత్తం రూ.15వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో అధ్యక్షులు పివీఎస్ ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు ఎన్.మదుసూదన్‌రావు, శంకరమఠం అర్చకులు టి.మల్లికార్జునశర్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణ మహాసంఘం తరపున ఎన్నో రకాలుగా వెనుకబడిన వారికి ఆర్థికంగా సాయం చేయడం జరిగిందని తెలిపారు. ఇటీవల అపరకర్మల నిమిత్తం రూ.10వేలు, వైద్యసాయం కోసం రూ.15వేలు అందజేయడం జరిగిందన్నారు. అనంతరం ఉదయ్ కుమార్ శర్మ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభినందనలు తెలిపారు.

## అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ళ పాలన పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వాళనతో ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. విజయోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్సుశుక్లతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృదిద సాధించిందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తొందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో కావలి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

## వైభవంగా గ్రామోత్సవం



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో వెలసి ఉన్న సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామ స్వామి దేవస్థానంలో తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం తెల్లవారుజాము వరకు గుమ్మలదిబ్బ పురవీధుల్లో గ్రామోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ గ్రామోత్సవం గుమ్మలదిబ్బ పురవీధుల్లో కొనసాగింది. ఉభయకర్తలుగా వార్త శ్రీనివాసులు, నరసమ్మ, వెంకటేశ్వర్లు, పావని, నాగేశ్వరరావు, ప్రభావతి దంపతులు వ్యవహరించారు.

## అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి



**పాటూరు (కోవూరు), జూన్ 16ప్రభాతవార్త :** చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను తల్లులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర అన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని మూడవ అంగ న్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు సంపూర్ణ అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలే సరైనవి అన్నారు. కేవలం అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే చిన్నారుల వయస్సుకు తగిననట్లు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు ఉన్నారు.

## అంగన్‌వాడీలోనే మెరుగైన విద్య




**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :**పతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కావాల్సిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని కోనేటి కయ్యలు ప్రాంతంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేలా తల్లులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను వీడియో రూపంలో కూడా అందిస్తున్నారన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆయాలు , తల్లులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త:** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత: కాలమునే పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ, కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, భక్తులు ఉన్నారు.

## మా జోలికొస్తే మేము ఏంటో మా సత్తా చూపుతాం



**బిట్రగుంట జూన్ 16 ప్రభాతవార్త** మా జోలికొస్తే మా కులస్తుల ఐక్యత ఏమిటో మా సత్తా చూపుతామని మండల వైసీపీ కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు యాదవ్ హెచ్చరించారు. బోగోలు జడ్పిటిసి మద్దిబోయిన కీర్తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కావలి నియోజకవర్గం లో యాదవ కులస్తులపై సోషల్ మీడియాలో విచ్చలవిడిగా అసభ్యకరంగా అవమానకరంగా వార్తలు రాస్తున్నారని ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, యాదవ కులంలో కూడా ఐక్యత ఉందని మేము కన్నెర్ర చేస్తే అడ్రస్ లేకుండా పోతారని హెచ్చరించారు. తాను చనిపోయినట్టు సోషల్ మీడియాలో ఒకరు పోస్ట్ పెట్టారని దానిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి బీసీ కార్డుతో జడ్పిటిసి నుండి రాజ్యసభ వరకు, జాతీయస్థాయి రాజకీయాల్లో కూడా తనకంటూ ప్రత్యేకంగా ఒక స్థానాన్ని సంపాదించుకున్న బీద మస్తానావును కూడా టార్గెట్ చేస్తూ అతనికి ఇటీవల విక్రమ సింహపురి యూనివర్సిటీ వారు డాక్టరేట్ బిరుదు ఇస్తే దానిపైన కూడా కథనాలు రాయడం ఏమిటని ప్రశ్నించారు. తాను సిద్ధాంతపరంగా బీదా సోదరులను విమర్శిస్తానని, అయితే వారు చేసిన మంచి పనులు కూడా ప్రశంసిస్తామన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేస్తే వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, దీని వెనక ఎవరున్నారో ఎవరు ప్రోత్సహిస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. విలేకరుల సమావేశంలో జడ్పిటిసి మద్దిబోయిన కీర్తన, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మద్దిబోయిన పద్మ, యాదవ సామాజిక వర్గానికి చెందిన పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ద్వారా ప్రతి ఇంటి ఓట్లు తనిఖీ



**ఉదయగిరి, జూన్ 16, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని 43,44,48, 49,51 ,52 బూత్‌లలో ఎస్ఐఆర్‌లలో భాగంగా బీఎల్ఓలతో కలిసి వెర్ఫికేషన్ చేస్తున్న ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దస్తగిరి అహ్మద్ తప్పులు తడాఖాలు ఉన్న ఉన్నాయా లేదా అనే అంశంపై నాయకుల నేతృత్వంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఓటర్ల జాబితాకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దస్తగిరి అహ్మద్ మండల యూత్ వింగ్ అధ్యక్షులు ఎంఏ సలీం, మాజీ కో ఆప్షన్ సభ్యులు షంషీర్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు ఇత్తడి రమణయ్య, గోగుల రామయ్య, బీసీ నాయకులు మట్ల హరి, ఆవుల సుబ్బయ్య, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు సామ్రాట్ లక్కినేని గడ్డం హజరత్, అయ్యా నల్లిపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయండి



**మనుబోలు జూన్ 16 ప్రభాతవార్త :** మనుబోలు మండలం అక్కంపేట గ్రామం ప్రజలు స్దానిక కూటమి నాయకులకు కులమతాలకు అతీతంగా గ్రామాభివృద్దికి పాటుపడాలని ఆధారాలు లేకుండా వ్యక్తిగత విమర్శలకు పాలుపడరాదని హెచ్చరించారు. మంగళవారం వారు విలేఖర్లతో మాట్లాడారు గత రెండు రోజులుగా గ్రామంలో స్మశాన స్దలంలో రాముల వారి ఆలయ నిర్మాణం గురించి జరుగుతున్న చర్చపై వారు స్పందించారు. ఈచర్చ వ్యక్తిగత విమర్శలకు దారితీస్తుంది అన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు చేసిన విమర్శలకు గ్రామ పెద్దలు ప్రజలు స్పందిస్తు అధికార పార్టీ నాయకులు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఆధారాలు లేకుండా వ్యక్తిగత విమర్శలు చేయరాదని ఆధారాలు చూపించి ఏదైనా మాట్లాడాలని మరియు స్మశాన స్దలాన్ని అలాగే ఉంచాలని ఆలయాన్ని వేరే ఎక్కడైనా నిర్మించుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో అంబటి శ్రీనివాసులు,అంబటి వెంకట సుబ్బారెడ్డి, దొడ్ల శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, పల్లంరెడ్డి శ్రీహరిరెడ్డి,పూండ్ల శ్రీహరిరెడ్డి, వెంకటకృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, కంద్రాతి శ్రీనివాసులు,చిట్యాల వెంకటరమణయ్య, నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజల్ ధరలును వెంటనే తగ్గించాలి

## సిఐటియు నాయకులు డిమాండ్



**కోట,జూన్ 16 ప్రభాతవార్త :** పెట్రోల్, గ్యాస్,డీజిల్ పెంచిన అధిక రెట్లను వెంటనే తగ్గించాలని సిపిఎం,సిఐటియు నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని చిట్టేడు, విద్యా నగర్‌లల్లో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరశనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా సిఐటియు నాయకులు కటారి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఒకే నెల్లో పెట్రోల్,డీజిల్ , గ్యాస్‌ధరలను పెంచిసామాన్య ప్రజల నడ్డి విరిచారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ ,డీజిల్ గ్యాస్ దరలను తగ్గించాలని ఆయన కోరారు. అంతక ముందు చిట్టేడు, విద్యాగనర్‌ల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రాజా, కార్యదర్శి బి.వి రమనయ్య,కోట,వాకాడు, చిట్టమూరు మండాల్లో ప్రాంతీయ కార్యదర్శి హరినాద్, చల్లా భాస్కర్, దారా శేషయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ అధికార దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** సీతారామపురం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సమీరా అధికార దుర్వినియోగం చేయడం పట్ల ఒకేషనల్ ట్రైనర్ కె. సాయినాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపల్ సమీరా తనపై గత సంవత్సర కాలంగా మానసిక వేధింపులు, బెదిరింపులు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులో సాయినాథ్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా తన స్థానంలో ప్రిన్సిపాల్ భర్తను నియమించాలని ఉద్దేశంతో తప్పుడు ఆరోపణలు చేయడం, విద్యార్థులు, తల్లి తండ్రులతో ఫిర్యాదులు చేయించడం విధుల్లో చేరకుండా అడ్డుకోవడం పదేపదే అవమానించడం వంటి చర్యలకు ప్రిన్సిపల్ పాల్పడుతున్నారని కలెక్టర్ వద్ద సాయి నాథ్ రెడ్డి మొరపెట్టుకున్నారు. 2026 – 27 విద్యా సంవత్సరానికి సంబంధించి తనకు అధికారికంగా రీన్యూవల్ ఆర్డర్ జారీ అయినప్పటికీ విధుల్లో చేర్చుకోవడానికి ప్రిన్సిపాల్ నిరాకరించారని తెలిపారు. ఉద్యోగం నుంచి తొలగిస్తామని ఇతర పాఠశాలకు వెళ్లాలని ఒత్తిడి తెచ్చారని తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పలుమార్లు బెదిరించారని కలెక్టర్‌కి తెలిపారు. తాను ఎలాంటి రాజీనామా చేయకపోయినా గూగుల్ షీట్లో రిజైన్ చేసినట్లు నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని వారు తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దీనిపై ప్రత్యేక విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా తనకు రావలసిన జీతాలు నిలిపివేయడం సహచరుల ఎదుట అవమానకరంగా ప్రవర్తించడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ప్రాంతీయ తనిఖీ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సాయినాథ్ తెలిపారు.

## వేదాయపాలెం పోలీసుల విస్తృత ఆకస్మిక తనిఖీలు -

## సరైన పత్రాలు లేని 17 వాహనాలు స్వాధీనం





**నెల్లూరు క్రైమ్, జూన్ 16, ప్రభాతవార్త:** జిల్లా ఇంచార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య సూచనలతో, వేదాయపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 5:30 గంటల నుండి 7:30 గంటల వరకు వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.వి. నగర్, అన్నగుంట ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు మరో 30 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఆపరేషన్ సందర్భంగా ప్రాంతంలోని నివాసాలు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలతో పాటు ఇతర కదలికలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనపరచుకుని తదుపరి పరిశీలన నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. అదేవిధంగా పాత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న 5 మంది రౌడీ షీటర్ల నివాసాలను తనిఖీ చేసి, వారి కార్యకలాపాలపై వివరాలు సేకరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రజలకు ఆస్తి సంబంధిత నేరాల నివారణ, ఇళ్ల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100,112సేవలను వినియోగించుకోవడం వంటి అంశాలపై సీఐ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అలాగే ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలా పాలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమ వుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహి చబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

## కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు

**మొదటి పేజీ తరువాయి** కోవూరు నియోజకవర్గంలో సుమారు 600 కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న మూడు సంవత్సరాలలో మంచి పనులు చేయనున్నట్లు తెలిపారు. మీరు భూమి, మీ హక్కు కార్యక్రమం ద్వారా నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రాజముద్రకి తోటి అందించడం రైతులకు ఎంతో మేలు చేస్తున్నదని ఆమె కొనియాడారు. కోవూరు నియోజకవర్గంలో సుమారు 600 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కావలి నియోజకవర్గం శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు విజయవంతమైన నేపథ్యంలో విజయోత్సవ సభ నిర్వహించుకోవడం గొప్ప విషయం అన్నారు. గత ప్రభుత్వం నుంచి ప్రజలు ఆలోచించి ప్రభుత్వానికి పట్టం కట్టిందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని భవిష్యత్తును గుర్తుంచుకొని ప్రభుత్వం ఏర్పడిందన్నారు. తల్లికి వందనం అన్నదాత సుఖీభవ ఎన్టీఆర్ భరోసా స్త్రీశక్తి కార్యక్రమాలు విజయవంతమైన ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలలో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అయిన తల్లికి వందనం, స్త్రీ శక్తి,అన్నదాత సుఖీభవ,ఎన్టీఆర్ భరోసా పించను పెంపు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో దుత్తలూరు వద్ద 2500 కోట్ల రూపాయలతో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అంతమైన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక సరైన నీటి వసతి కూడా లేకుండా ఉండిందని నేడు పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి కల్పన వంటి అభివృద్ధి పనులు ఏర్పాటు చేయడం జరుగుతున్నదని తెలిపారు. నియోజకవర్గంలో 50 కోట్ల నిధులతో హాలో అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయడం జరిగిందని, అదేవిధంగా 600 కోట్ల రూపాయలతో రహదారులు వేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో నరవాడ దేవస్థానాన్ని 12 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారం ఎంతో ఉందని ఆయన తెలిపారు. గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలలో సుమారు 3 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారాలు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహాయం చాలా గొప్పదని, రాబోయే రోజుల్లో పరిపాలన మరింత మెరుగ్గా ఉంటుందని ఆశాబావం వ్యక్తం చేశారు. గూడూరు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, వ్యవసాయం తదితరాలకు మారుగా 3000 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. తదనంతరం వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాబోయే తరాల బిడ్డలకు ఎన్డీఏ ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్నామని చాటి చెబుదామని పిలుపునిచ్చారు. చాలా కష్టపడి చెమటోడ్చి ప్రభుత్వం వేటగా ఏర్పడిందని, చాలా కుటుంబాలు మరణించాయని, వాటి ఫలితమే రాజ్యాధికారం వచ్చిందని అభిప్రాయపడ్డారు. సూపర్ సిక్స్ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ప్రపంచంలో అనిస్థితి అల్లకల్లోలంగా ఉన్నప్పటికీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దేశాన్ని సుభిక్షంగా ఉంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ పథకాలను సమాంతరంగా కొనసాగిస్తున్నదని ఆయన తెలిపారు. రాబోయే తరాలు బిడ్డలకు ఎన్డీఏ ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్నామని చెబుదామని ఆయన తెలిపారు. పరిశ్రమలు మోడీ నాయకత్వం ద్వారా చంద్రబాబు నాయకత్వం ద్వారా రాష్ట్రానికి వస్తున్నాయని తద్వారా ఉపాధి లభిస్తున్నదని తెలిపారు. గోపాలపురం శాసనసభ్యులు, జోనల్ ప్రెసిడెంట్ వెంకట రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం ద్వారా స్వేచ్ఛ, స్వాతంత్రాన్ని పొందారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు గత రెండు సంవత్సరాలుగా స్వేచ్ఛ స్వాతంత్రం పొందారని గోపాలపురం శాసనసభ్యులు వెంకటరాజు అన్నారు. మీ భూమి మీ హక్కు ద్వారా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. 76 సంవత్సరాల వయసులో కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభ్యున్నతికి అవిరళ కృషి చేస్తున్నారన్నారు. శాసన మండల సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించాలని ఇంత జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయమన్నారు. గత రెండు సంవత్సరాలుగా సంక్షేమం అభివృద్ధి, పరిశ్రమల కల్పనకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని, దానికి నరేంద్ర మోడీ సహకారం ఉన్నదని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ పరిపాలనను గాడిలో పెట్టడానికి పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి కలెక్టర్ హిమాన్సు శుక్ల కృషి అభినందనీయమని అని కొనియాడారు. జిల్లాల అభివృద్ధికి పరిశ్రమల స్థాపనకు సంబంధించి కోట్ల రూపాయల వ్యయంతో బిపిసిఎల్ కంపెనీ ఏర్పాటు జరుగుతున్నదని ఆయన తెలిపారు. కొవ్వూరు అభివృద్ధికి శాసనసభ్యులు ప్రశాంత్ రెడ్డి కృషి అభినందనీయమని కొనియాడారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ సారథ్యంలో రాష్ట్రం ముందుకు నడుస్తున్నదని గత 12 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా 140 కోట్ల జనాభాను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా నాలుగు కోట్ల 9 లక్షల మేర మహిళలు 175 కోట్ల రూపాయలు మేర లబ్ధి పొందాలని వెల్లడించారు. ఈ కార్యక్రమం అనంతరం డిఆర్డిఏ శాఖ ద్వారా పలువురు లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఆటోలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల, శాసనసభ్యులతో కలిసి అందజేశారు. తొలుత వాత్సల్య అనాధ పాఠశాల, గురుకృపకరా నికేతన్ ద్వారా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చివరిగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రతీకగా విజయోత్సవ వేడుకలు నిలిచాయి. ఈ సంబరాల్లో స్థానిక ప్రజలు, అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో కస్తూరిదేవి గార్డెన్స్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. అంతకు ముందు జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల, ఆయా శాఖల అధికారులు నెల్లూరు జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. కాగా అనంతరం కస్తూరి దేవి గార్డెన్స్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిభింబించేలా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను వారు సందర్శించారు. ఈ విజయోత్సవ సంబరాల్లో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు పలువురు రాజకీయ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం వేధింపులు.. భార్యపై దాడి

**నెల్లూరు క్రైం, జూన్ 16, ప్రభాతవార్త :** అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతూ భార్యపై ఇటుకతో దాడి చేసిన ఘటన నెల్లూరు రూరల్ మండలంలోని మదరాజగూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక దళితవాడకు చెందిన పాలిపి మానసకు పాలిపి ప్రశాంత్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహం అనంతరం భర్త ప్రశాంత్ అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేస్తూ మానసను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అలాగే అత్త పాలిపి వరలక్ష్మి, మామ పాలిపి సీనయ్య కూడా కట్నం డిమాండ్లకు మద్దతు ఇస్తూ వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతకు ముందు తనపై జరుగుతున్న వేధింపుల విషయమై మానస నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందుకు కక్ష పెంచుకున్న ప్రశాంత్, ఈ నెల సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఆమెపై ఇటుకతో దాడి చేశాడు. ఈ దాడిలో మానస తల కుడి భాగంలో రక్తస్రావ గాయం కాగా, ఎడమ చేతికి వాపు, గీతల గాయాలు అయ్యాయి. అనంతరం భర్త ఇద్దరు పిల్లలను తన వద్దే ఉంచుకుని మానసను ఇంటి నుంచి వెళ్లగొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన మానసను ఆమె తల్లి, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పొదలకూరులో ఘనంగా హనుమజ్జయంతి అనంతర ఉత్సవాలు

**పొదలకూరు, జూన్ 16, ప్రభాతవార్త :** పొదలకూరు పట్టణంలోని మారుతీ నగర్‌లో వెలసి ఉన్న శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి అనంతర వారోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గత దశాబ్ద కాలంగా హనుమజ్జయంతి అనంతరం వరుసగా 13 మంగళవారాలు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో అయిదవ మంగళవారం ఉత్సవాలను పొదలకూరు మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయులు, అర్చకులు వేణుకుమార్ స్వాములు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి గ్రామోత్సవం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## కుల దూషణల ఆరోపణలు.. మహిళ ఆత్మహత్యాయత్నం



**తోటపల్లి గూడూరు, జూన్ 16, ప్రభాతవార్త :** మండలంలోని ఈదూరు మిట్టపాలెంకు చెందిన వాకాటి వైశాలి (ఎస్సీ) ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు సుమారు 15 సంవత్సరాల క్రితం ఇనకళ్ళ వెంకట శేషయ్య (బీసీ)తో కులాంతర వివాహం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల గ్రామంలో జరిగిన తిరునాళ్ల సందర్భంగా కొందరు వ్యక్తులు తనను కులం పేరుతో అవమానించి దూషించారని ఆరోపిస్తూ వైశాలి తీవ్ర మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె బంధువుల ఇంటి సమీపంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఇప్పటివరకు అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదని తెలిసింది. ఫిర్యాదు అందితే పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. కుల దూషణల ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటన ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

## గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 5.93 లక్షలు



**ఇందుకూరుపేట జూన్ 16, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వెలసియున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు హుండీలను అధికారులు, కమిటీ సభ్యుల సమక్షంలో తెరిచారు. గత మూడు నెలలకు గాను అమ్మవారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదును లెక్కించారు. ఈ లెక్కింపులో అమ్మవారి ప్రధాన హుండీ ద్వారా రూ. 5,93,784 ఆదాయం రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ. 28,363 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గత త్రైమాసికంతో పోల్చితే ఈ మూడు నెలల్లో అమ్మవారి హుండీ ఆదాయం రూ. 53,330 పెరిగిందని వారు పేర్కొన్నారు. ఈ హుండీ లెక్కింపు ప్రక్రియను కొవ్వూరు గ్రూప్ దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి ఎన్. కృష్ణప్రసాద్, చాముండేశ్వరి దేవస్థాన చైర్మన్ గుండాల కృష్ణారెడ్డిలు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని లెక్కింపును పరిశీలించారు.

## నెల్లూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వ నిధుల వెల్లువ

**– కూటమి పాలనలో వేగవంతమైన అభివృద్ధి – బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డిఎస్. పరశురాం**



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతావార్త – అగ్రికల్చర్ :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డిఎస్ పరశురాం ఆధ్వర్యంలో ప్రగతి పాదయాత్ర పేరుతో నెల్లూరు జిల్లాలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులను పార్టీ నేతలు మంగళవారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులను సందర్శించారు. బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, నెల్లూరు పెన్నా నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని, అలాగే నేషనల్ హైవే గొలగమూడి క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిని పార్టీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డిఎస్. పరశురాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు అనేక అభివృద్ధి ప్రాజెక్టులను మంజూరు చేసిందన్నారు. నెల్లూరు పెన్నా నదిపై పూర్తికావస్తున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించామన్నారు. 2025లో ఈ నిర్మాణం మొదలై 2026 లో పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. ఇంత పెద్ద బ్రిడ్జిని సంవత్సర కాలంలోనే పూర్తి చేసి ఈ నెలాఖరుకు బ్రిడ్జి కాంట్రాక్టర్లు, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పడం జరిగిందన్నారు. అలాగే గొలగమూడి క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి 76 కోట్లతో గుత్తేదారులు దక్కించుకోవడం జరిగిందని, ఇది 2024లో మంజూరై జరిగిన ఈ రెండేళ్ల కాలంలో వేగవంతంగా పూర్తికావస్తుండడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ రెండు బ్రిడ్జిలు కూడా ఆగస్టు నెలాఖరుకు పూర్తవుతాయని కాంట్రాక్టర్లు వెల్లడించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు గోళ్ళ నరసింహులు, మరో ఉపాధ్యక్షులు కటకం మనోజ్, బిజెపి మండల అధ్యక్షుడు కోసూరు వెంకట సుధీర్, మండల ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మురారి మల్లికార్జున్, పొట్టి శివ, పలు మండలాల ఎస్సీ మోర్చా అధ్యక్షులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు




**వింజమూరు, జూన్ 16, ప్రభాతవార్త :** వింజమూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం జిల్లా ఎస్పీ అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సుబ్బారావు స్థానిక ఎస్సై ఎం ఉమామహేశ్వరరావులు హాజరయ్యారు. ఆటో డ్రైవర్లు స్కూల్ బస్సు డ్రైవర్లు క్యాబ్ డ్రైవర్ లు పట్టణంలోని దుకాణదారులతో ఈ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రైవర్లు చేసే ఒక చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందన్నారు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆటో క్యాబ్ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఓవర్ లోడ్ వేయవద్దని సూచించారు తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. వాహనాలను అతివేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రాణాంతకం అని హెచ్చరించారు. ముఖ్యంగా స్కూల్ బస్సు డ్రైవర్లు విద్యార్థుల భద్రత విషయంలో అదనపు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత పై ర్యాలీ నిర్వహించారు. అలాగే దుకాణాదారులు వారి వ్యాపారాలు నిమిత్తం రోడ్డును ఆక్రమించడంతో వాహనాలు రోడ్లపైనే నెలపాల్సి న పరిస్థితి వస్తుందని కనుక దుకాణదారులు రోడ్డు మార్జిన్ ను వదిలి వారి వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. అందువల్ల డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటిస్తూ లైసెన్స్ ను తప్పనిసరిగా పొందాలని అలాగే వాహనం ధ్రువీకరణ పత్రాలను తమ దగ్గర ఉంచుకోవాలని ఎవరైనా అధికారులు అడిగినప్పుడు తప్పక చూపించాలన్నారు. లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

## జోరుగా ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



**వింజమూరు, జూన్ 16, ప్రభాతవార్త :** వింజమూరులో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతుంది. మంగళవారం మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జక్కం మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మాలకొండయ్య నేతృత్వంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సందర్శించి ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ఏపీటీఎఫ్ ఆశయాలు సాధించిన విజయాలు వివరించి యూనియన్‌లో చేరేందుకు సభ్యత్వ నమోదు చేయించుకుంటున్నారు. మెరుగైన సమాజం కోసం విద్యార్థుల అవసరాలు తీర్చే విద్యా విధానం కోసం, ఉపాధ్యాయుల సర్వీస్ కండిషన్‌లో పెరుగుదల కోసం నిరంతరం ఏపీటీఎఫ్ పనిచేస్తుందని వారు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఏపీటీఎఫ్ పనిచేస్తుందని వారు తెలిపారు. అలాగే మండలంలో 100 శాతం సభ్యత్వ నమోదు లక్ష్యంగా ముందుకెళ్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పి. మల్లికార్జున రావు, పి రమణయ్య, వి శివ, కోటారెడ్డి పి.కొండారెడ్డి, యు. ప్రసాద్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు



**మర్రిపాడు, జూన్16, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఉన్నతపాఠశాల లో 10వ తరగతి పరిక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి 500లకు పైగా మార్కులు సాధించిన నాగరాజుపల్లి విక్రాంత్, కలువాయి సునీత, వల్లెపు నరేష్‌లకు పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి పాపుదిప్పు రమణారెడ్డి ఒక్కక్కరికి ఇరవైవేల రూపాయల వంతున మొత్తం 60వేల రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతులను మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో 500లకు పైన మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి 20వేల రూపాయల వంతున నగదు ప్రోత్సాహకాలు అందజేయడం అభినందనీయమని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళేందుకు ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థిగా రమణారెడ్డి పాఠశాల పట్ల చూపుతున్న అభిమానం, విద్యార్థుల భవిష్యత్తు పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమన్నారు. దాత రమణారెడ్డి మాట్లాడుతూ విద్య జీవితానికి బలమైన పునాది అని విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. భవిష్యత్తులో కూడా 500లకు పైన మార్కులు వచ్చిన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి 20వేల రూపాయల వంతునప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గంగపాళెం ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, రాజుపాళెం ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు డి.వి.రమణయ్య, పెంచలరావు, బాలాజీ, మల్లిఖార్జున స్వామి, తిరుపాలు, రహీమ, ప్రసాద్, రాఘవేంద్ర, కలిశెట్టి రాజేంద్రకుమార్, యలగాల శ్రీనివాసులు, గ్రామానికి చెందిన నాగరాజుపల్లి రాజారా, కాకే సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత ఐస్ ఫ్యాక్టరీలో గుర్తు తెలియని మృతదేహం



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి రామన్నపాలెం గేట్ సమీపంలో మూతబడి ఉన్న ఐస్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో గుర్తు తెలియని మృత దేహం పూర్తిగా డీ కంపోజ్ అయింది. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై ముత్యాలరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ వ్యక్తి ఆ ప్రాంతంలో భిక్షం ఎత్తుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఆ ప్రాంత వాసులు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు గ్రామాల బాట



**వింజమూరు, జూన్ 16, ప్రభాతవార్త :** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని సత్వరమే పరిష్కారం చెప్పేందుకు వింజమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో కే రామారావు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్ పంచాయతీ పరిధిలోని గ్రామాల బాట పట్టారు. మంగళవారం నేరేడుపల్లి కోక వారి పాలెం సిద్ధార్థ నగర్ ప్రాంతాలలో పర్యటించి పరిశీలించారు. కొన్ని వీధుల్లో లో పైప్ లైన్ లీకేజ్‌ల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుర్తించారు. అలాగే మురుగు కాలవలో పూడిక డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచే ప్రమాదంను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కోకవారిపాలెం ప్రధాన రహదారి సిద్ధార్థ నగర్ అంతర్గత రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నేరేడు పల్లెలో పలుచోట్ల వెలగని విద్యుత్తు దీపాలను గుర్తించి వాటి స్థానంలో నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో డెంగ్యూ మలేరియా డయేరియా వంటి సీజన్ వ్యాధులు ప్రభులే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. త్రాగు నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. నీటి సరఫరా పైపులైన్ల మరమ్మత్తుల గురైన వెంటనే వాటిని మరమ్మత్తులు చేయించి ప్రజలకు మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

## కావలి 10వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమం



**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 10వ వార్డులో 96, 97, 98 బూతులలో బిఎల్ఏలు మహమ్మద్ హాఫీజ్, మహమ్మద్ ఆసీఫ్, మేక అభిషేక్‌లు మంగళవారం వార్డులో ఓటర్ల జాబితా సవరణ ఇంటింటా సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటికి వెళ్ళి సంబంధిత అప్లికేషన్‌లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 2వ క్లస్టర్ కోకన్వీనర్ టిడిపి 10వ వార్డు ఇన్‌చార్జ్ వల్లేరి వెంకటకిరణ్ కుమార్ పాల్గొని సహాయ సహకారాలు అందించడం జరిగింది.

## అమరనాథ్ గౌడ్ చిత్రపటానికి నివాలులర్పించిన టిడిపి నేతలు



**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో మూడు సంవత్సరాల క్రితం జరిగిన అమరనాథ్ గౌడ్ హత్య ఘటనను స్మరించుకుటూ ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొని అమరనాథ్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ మా అక్కను ఎందుకు వేదిస్తున్నారని ప్రశ్నించినందుకు పదవ తరగతి విద్యార్థి అమర్‌నాథ్‌గౌడ్‌ను వైసిపి నేతలు పెట్రోల్ పోసి తగలబెట్టి హత్య చేశారని ఆరోపించారు. ఈ దారుణ ఘటనకు నేటితో మూడేళ్ళు అవుతున్నా భాధిత కుటుంబానికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యకేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు బెయిల్‌పై బయటకు వచ్చి తిరుగుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఇప్పటికే భయం భయంగా ఉన్నారని తెలిపారు. బిసిలు, ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధి పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆయా వర్గాల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం శాంతి భద్రల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో కావలి టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్వి జ్యోతిబాబు, మాజీ సోమశీల ఛైర్మెన్ కండ్లగుంట మధుబాబునాయుడు, పట్టణ ఉపాధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ ఏఇ శ్రీహరి గుండెపోటు మృతి

**– మృతదేహాన్ని పరిశీలించిన సిఐ**



**బుచ్చి జూన్ 16 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం వ్యవసాయాధికారి శ్రీహరి గుండెపోటుతో మృతి చెందారు. పెంచలకోన దైవదర్శనానికి వెళ్ళి వస్తుంటే గుండెపోటుతో మృతి చెందారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. అయితే ఆయన కంటి కిందబాగం, మెడ వద్ద గాయాలు వుండగా గ్రామస్తులు, పలువురు అనుమానం వ్యక్తం చేస్తుండడంతో సిఐ శ్రీనివాసరావు కుటుంబసభ్యులను శ్రీహరి మృతిపై ఏమైనా అనుమానులు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎటువంటి అనుమానులు లేవని ఆయన భార్య కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న శ్రీహరి మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహం వద్ద సంతాపం తెలియజేశారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ అసిస్టెట్ ఎలక్ట్రోల్ రిజస్టేషన్ అధికారి జి.శ్రావన్‌కుమార్ 76వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని స్తానిక తటపర్తి వారి వీధి నందు ఎన్యుమిరేషన్ పారం సర్ కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని బూల్‌లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్ళి ఎన్యుమరేషన్ పారాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బిఎల్ఓలకు ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఒ వివేక్, బిఎల్ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తల చేతిలో గాయపడ్డ వైసిపి సోషల్ మీడియా అధ్యక్షుడు వంశీని పరామర్శించిన ప్రసన్న



**బుచ్చి జూన్ 16 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డిపాళెం రూరల్ వైసిపి సోషల్ మీడియా అధ్యక్షులు ముక్కు వంశీగౌడ్ సోషల్ మీడియా ద్వారా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ప్రశ్నించి ంనందుకు దామరమడుగు గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గంజాయి బ్యాచ్‌తో కలిసి దాదా పు 20 మంది ఆటోలో అతనిని వెంబ ండించి విచక్షణారహితంగా వంశీపై దాడి కి పాల్పపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వైసిపి రాష్ట్ర పిఎసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్దానిక వైసిపి నాయకులతో కలిసి దామరమడుగులోని వంశీ నివాసానికి వెళ్ళి దాడికి గల కారణాలు వంశీని అడిగి తెలుసుకొని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని వంశీకి భరోసా ఇచారు. వైసిపి నాయకులు ఉన్నారు.

## 18నుండి ఇసుజు మాన్సూన్ సర్వీసు క్యాంప్స్

**నెల్లూరు, జూన్16 ప్రభాతవార్తవిద్య :** తమ సంస్ద ఈ నెల 18 నుండి దేశవ్యాప్తంగా ఐ కేర్ ప్రీ మాన్సూన్ సర్వీసు క్యాంపులను నిర్వహించటం జరుగుతుందని ఇసుజు ఇండియా సంస్ద ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సంస్ద కార్యాయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈనెల 18నుండి 24 వరకు ఈ క్యాంపు నిర్వహించటం జరుగుతుందన్నారు. దేశంలోని అన్నీ ఇసుజు అధీకృత డీలర్స్ సర్వీసు కేంద్రాల్లో ఇది అందుబాటులో ఉంటుందన్నారు. ఇసుజు డీ మాక్స్ పికప్‌లు, ఎస్‌యూవీ, వాహనాల వినియోగదారులు ఈ క్యాంపుకు విచ్చేసి ప్రత్యేక సేవలు, రాయితీలను పొందవచ్చున్నారు. ఈ క్యాంపులో పాల్గొన్న వాహనాలకు 7 పాయింట్ల సమగ్ర తనిఖీ నిర్వహించటంతోపాటూ లేబర్ చార్జీలపై 10శాతం, విడిబాగాలపై 5శాతం , ల్యూబ్రికెంట్లు, ఫ్లూయిడ్స్ పై 5శాతం, రాయితీ ఇవ్వటం జరుగుతుందన్నారు. అలాగే రోడ్‌సైడ్ అసిస్టెన్స్, ప్రోకేర్, ఎక్స్ టెండెడ్ వారంటీలపై కూడా ఈ రాయితీలు వర్తిస్తాయన్నారు. హైదరాబాద్, తిరుపతి, రాజమండ్రి, నెల్లూరు, కర్నూలు, కడప, ఖమ్మంతోపాటూ దేశంలోని 100 కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్ద ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా వైద్యశాలలో యోగ కార్యక్రమం



**డాక్యుమెంట్లు పోయినవి**
చలమల ఈశ్వరమ్మ w/o నాగిరెడ్డి, కలువాయి గ్రామం (మం) SPSR నెల్లూరు జిల్లా నందు నివసించుచున్నాను. ప్లాట్‌కు సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ 8756/2011. ఇందుకు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెంబర్ 2166/2008. తేది 30.05.2026న నెల్లూరు నుండి కలువాయికి పోవుచుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెంబర్ 2166/2008 జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల తెచ్చి ఇవ్వగలరు.
సెల్: 9492691586

**కావలి, జూన్ 16 ప్రభాతవార్త :** ఈనెల 21న యోగా దినోత్సవంగా స్థానిక ఏరియా వైద్యశాలలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యోగా గురువు గోల్‌మెడలిస్టు జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె యోగాలో పాల్గొని వారిచే యోగాలు చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల ఇన్‌చార్జ్ మెడికల్ సూపర్నెంట్ డాక్టర్ హరిత, ఆర్ఎంఒ ప్రమీల, వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు మారినా.. ఆ బోర్డు మారలేదెందుకో!

**:తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం :దర్శనమిస్తున్న మాజీ ఆర్డీవో పేరు**



**విడవలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో ఉండాల్సి న ప్రభుత్వ కార్యాలయాల్లోనే పాలనా యంత్రాంగం నిర్లక్షయం రాజ్య మేలుతోంది. నిత్యం వందలాది మంది ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే తహశీల్దార్ కార్యాలయంలోనే అత్యంత కీలకమైన సమాచార హక్కు చట్టం బోర్డు ఇప్పుడు అపహాస్యంగా మారింది. ఏమిటీ నిర్లక్ష్యం? తహశీల్దార్ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం అధికారుల వివరాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డును పరిశీలిస్తే అధికారుల పనితీరు అర్థమవుతోంది. బోర్డులో ఇప్పటికీ మాజీ ఆర్డీవో వంశీకృష్ణ పేరు ఉండటం గమనార్హం. ఆయన బదిలీపై వెళ్లిపోయినప్పటికీ, ఆ స్థానంలో కొత్తవారి పేరును మార్చడంలో యంత్రాంగం విఫలమైంది. ప్రజల సందేహాలు.. అధికారుల మోనం

**అధికారుల తీరుపై అనుమానాలు:** కార్యాలయంలోని బోర్డుపై ఉన్న పేర్లనే మార్చలేని తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఇక ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**బోర్డును చూసి విస్మయం:** ఆర్డీవో ఎవరు, వారి వివరాలు ఏమిటో తెలుసుకోవాలని ఆ బోర్డును చూసే సామాన్య ప్రజలు, అక్కడ మాజీ ఆర్డీవో పేరు ఉండటం చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు.

**బాధ్యతారాహిత్యం:** ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాల్సి న కనీస బాధ్యత కూడా అధికారులకు లేకపోవడంతో, ప్రభుత్వ లక్ష్యమైన పారదర్శక పాలన్ల కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సదరు అధికారులు కనీసం ఇప్పటికైనా స్పందించి, పాత బోర్డును తొలగించి, ప్రస్తుత అధికారుల వివరాలతో కూడిన కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద చేపట్టే పనులకు కూలీల శాతాన్ని మరింత పెంచేలా ఉపాధి హామీ పథకం సిబ్బంది తగు చొరవ తీసుకోవాలన్నారు. చేపట్టే పనులు మరింత వేగవంతం కావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం ఆయన ఆన్‌లైన్‌లో మస్టర్‌ను పరిశీలించారు.

## గిరిజన చిన్నారులకు బడిబాట

**:మధ్యలో చదువు మానేసిన వారిపై ప్రత్యేక దృష్టి**



**కొడవలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** మండలంలోని గుండాలమ్మపాలెం, లక్ష్మీ మ్మపురం, ఈతతోపు, గుంటకట్ట, జొన్నవాడగుంట, చలివేంద్రం, దామేగుంట, ఛాయప్ప తదితర గిరిజన ప్రాంతాల్లో యానాధుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు, పద్మభూషణ్ శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర గిరిజన సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటగిరి సుధాకరరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన బాలబాలికలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి చదువుకోవాలని అవగాహన కల్పించారు. మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలను తిరిగి బడిబాట పట్టించేలా చైతన్యపరిచారు. ప్రతి చిన్నారి రోజూ పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విద్య ద్వారానే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## ఇంటింటికీ ఎస్ఐఆర్ పరిశీల



**కొడవలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు పంచాయతీలో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు బీఎల్ఏలు, టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. బీఎల్‌వో, వీఆర్వో రావినూతల శ్రీనివాసులు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీ భాషా, గుండాలమ్మపాలెం సొసైటీ డైరెక్టర్ పంది శ్రీనివాసులు, మండల మైనారిటీ నాయకుడు ఎస్‌కే భాషి, యూనిట్ కన్వీనర్ నాయబ్ రసూల్, కోకన్వీనర్ మన్నెం సుకుమార్, బూత్ కన్వీనర్లు జనేష్, షాజహాన్, జింకల రాజా, గడ్డం సుబ్బయ్య, చోటే భాయ్, సంధాని తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల ప్రతిభకు యుటీఎఫ్ ఘన సన్మానం



**చేజర్ల, జూన్ 16, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన (యూటీఎఫ్) ఆధ్వర్యంలో అభినందన, సన్మాన కార్యక్రమం మంగళవారం సాయంత్రం చేజర్ల మండల కేంద్రంలోని యుటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు, విశిష్ట ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చేజర్ల మండల ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. దాదాపు 15 సంవత్సరాల క్రితమే ఎన్జీ అగ్రహారం, మాముదూరు, బిల్లుపాడు, నాగులవెల్లటూరు వంటి మారుమూల గ్రామాల్లో తల్లిదండ్రుల సహకారంతో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించి మూతపడే పరిస్థితిలో ఉన్న పాఠశాలలను నిలబెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్య అనేది అందరికి సమానంగా అందాల్సి న హక్కు అని, పాశ్చాత్య దేశాల్లో అమలవుతున్న విధంగా నాణ్యమైన విద్య ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉంటేనే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత దేశ భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థుల చేతుల్లోనే ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన మండల విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు యుటీఎఫ్ చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని కొనియాడారు. 2026పదవ తరగతి పరీక్షల్లో చేజర్ల మండల విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివి మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను, 550కు పైగా మార్కులు సాధించిన మొత్తం 34 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అలాగే 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాటు, తాము బోధించిన సబ్జెక్టుల్లో విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించేలా కృషి చేసిన 25 మంది ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి వారి కృషిని కొనియాడగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం మొత్తం విద్యా ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలల విజయగాథలను ప్రతిబింబించేలా సాగింది. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వివి శేషులు, జిల్లా కార్యదర్శి ఎన్.రమణయ్య, యుటీఎఫ్ నాయకులు ఎం.రవిబాబు, ఏ.సుబ్రహ్మణ్యం, ఆర్‌వి కృష్ణారెడ్డి, ఏ.వెంకటేశ్వర్లు, పి.నరహరి, షేక్ మస్తాన్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కురుగొండ్ల



**సైదాపురం, జూన్ 16,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో మండల కేంద్రమైన సైదాపురంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ స్థాయిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రంలో తిరుగులేని సంక్షేమంతో పాటు అద్భుతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గ పురోగతిలో భాగంగా కేంద్రం నుండి 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుండి 40శాతం నిధులను పక్కా ప్రణాళికతో వినియోగిస్తున్నామని, గత ప్రభుత్వంతో పోలిస్తే నేడు నిధుల పంపిణీలో పారదర్శకత పెరిగిందని ఆయన అన్నారు. రాబోయే కాలంలో వెంకటగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోడి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు కేకే చౌదరి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు, నియోజకవర్గంలోని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 16 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక నర కూరు ప్రాంతంలో డ్రైన్ కాలువల పూడికతీత పనులను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. క్రమం తప్పకుండా డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ వ్యర్థాల ఎత్తివేత పనులను నిర్వహించి మురుగునీటి ప్రవాహం సాఫీగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. డ్రైనుకాలువలను ఆక్రమించి మెట్లు ర్యాంపులు లాంటి నిర్మాణాలు చేపట్టకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఈకార్యక్రమంలో నెల్లూరు నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజాని, ఈఈ అనీల్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసిపి వేణు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా మునిసిపల్ అధ్యక్షురాలు షేక్ షకిలాబేగంను పరామర్శించిన మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి జూన్ 16 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన వైసిపి జిల్లా మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షురాలు షేక్ షకీలాబేగం జబీవ అస్వస్థతకు గురయ్యారు. రెండు ,మూడు రోజులు నెల్లూరులో వైద్యశాలలో చికిత్స చేయించుకొని వచ్చారు. ఈవిషయం తెలుసుకొని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 7 వార్డులో ఉన్న షేక్ షకిలా బేగం ఇంటికి వచ్చి ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్యం త్వరగా కుదుట పడాలని ఆయన ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు షేక్ షాహుల్, రూరల్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు కందుకూరు యానాదిరెడ్డి, డాక్టర్ అల్లాబక్షు, కడివేటి శ్రీనివాసులురెడ్డి , కడివేటి అన్వేష్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, తాళ్ళ వెంకటేశ్వర్లు, కోరికల చంద్రశేఖర్, సయ్యద్ షామీర్ తదితరులున్నారు.

## రెండేళ్ల విజయాలు స్ఫూర్తిగా 2029 లక్ష్యంగా ముందుకు సాగాలి



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త – వైద్యం :** రాబోయే 2029 ఎన్నికలను మనస్సులో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని, వచ్చే ఎన్నికల్లోనూ జిల్లాలో 10కి 10 సీట్లు గెలవడమే లక్ష్యంగా కష్టపడాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కస్తూరి దేవి గార్డెన్స్‌లో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం జిల్లా స్థాయి విజయోత్సవ సభలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాలు చాలా గొప్పగా పని చేశామని చెప్పి ఊరుకోకూడదని, రాబోయే మూడు సంవత్సరాలు దీనికంటే ఎక్కువగా, అంకితభావంతో కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని, ఈ రోజు విజయోత్సవ సభ మన నెల్లూరులో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లాలోని నలుమూలల నుంచి ప్రతి ఒక్కరు ఈ సభకు హాజరవుతున్నారని అన్నారు. తనకు ముందు మాట్లాడిన ప్రతి ఒక్కరు కూడా జిల్లాలో ఏఏ అభివృద్ధి పనులు జరిగాయి, ప్రజలకు ఎలాంటి సంక్షేమం అందిందో గుర్తుచేశారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దాదాపు 2001 నుంచి ముఖ్యమంత్రిగా పని చేశారని, 2014లో ప్రధానమంత్రి అయిన ఆయన ప్రస్తుతం ప్రధానిగా 12వ సంవత్సరంలోకి అడుగుపెట్టారని చెప్పారు. నాడు దేశం ఏ పరిస్థితిలో ఉందో, నేడు ప్రపంచంలోనే ఏ స్థాయికి చేరుకుందో అందరూ చూస్తున్నారని, ఆయన పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెంది అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈరోజు ఈ పరిస్థితిలో ఉందంటే, మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. చంద్రబాబు విజన్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్రమశిక్షణ, యువనేత నారా లోకేష్ బాబు నిబద్ధతతోనే కూటమి సుపరిపాలన అందిస్తోందని చెప్పారు. వీళ్ల ముగ్గురి నేతృత్వంలో మనమందరం కష్టపడి రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ రోజు థీమ్ మీ భూమి– మీ హక్కు అంశంపై ఎంపీ మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం రాగానే గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద, ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ని రద్దు చేసిందని అన్నారు. ఈరోజు రైతులకు స్పెషల్ క్యూఆర్ కోడ్, రాజముద్రతో అధికారికంగా పట్టా పాస్‌బుక్కులు వస్తున్నాయంటే మనమందరం నిజంగా చాలా సంతోషపడాలని అన్నారు. మీ భూమి మీదేనని, దానిపై మీకే పూర్తి హక్కు ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు రాజ ముద్రతో 100 శాతం హక్కు కల్పించారని తెలిపారు. ఇప్పటి వరకు ఎలా కష్టపడ్డారో రాబోయే మూడేళ్లు కూడా పార్టీ శ్రేణులందరూ అంతే అంకిత భావంతో పని చేయాలని, అప్పుడే 2024 ఎన్నికల్లో లాగే, రాబోయే 2029 ఎన్నికల్లో కూడా మన జిల్లాలో 10కి 10 సీట్లు గెలవడం ఖాయమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## నేడు గూడూరులో విజయోత్సవ సభ



**కోట, జూన్ 16 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సంద ర్భంగా గూడూరులో బుధవారం విజయోత్సవ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు చెప్పారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ, మత్స్యకారులకు ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు సహాయం తదితర హామీలను అమలు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## లంక ప్రీమియర్ లీగ్ కు భారీగా పెట్టుబడులు

**నెల్లూరు,జూన్16 ప్రభాతవార్తవిద్య :** జులై 19నుండి ప్రారంభం కానున్న లంక ప్రీమియర్ లీగ్(ఎల్‌పిఎల్)కు భారీగా ఆర్థిక ఊతం లభించింది. ఎల్‌పిఎల్ ప్రమోటర్లు అయిన ఇన్నోవేటివ్ ప్రోడక్షన్ గ్రూప్స్ అమెరికాకు చెందిన నాస్‌డాక్ లో నమోదైన సంస్థతో వ్యూహాత్మక ఆల్‌స్టాక్ విలీనాన్ని పూర్తి చేసినట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా మంగళవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ విలీనంతో ఎల్‌పిఎల్‌తో పాటూ టీ20 లీగ్‌ల వాణిజ్య హక్కులు నాస్‌డాక్‌లో నమోదైన ఉగ్రో ప్లాట్‌ఫామ్‌లోకి చేరటం జరిగిందన్నారు. రాబోయే రెండేళ్లలో ఎల్‌పిఎల్ అభివృద్ధి కోసం 20మిలియన్ డాలర్ల సుమారు 170 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనట్లు ఐపిజీ పేర్కొంది. ఈ పెట్టు బడులతో లీగ్ నిర్వహణ, మార్కెటింగ్, అంతర్జాతీయ ప్రచారం, వాణిజ్య విస్తరణ తదితర వాటిని అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు. ఎల్‌పిఎల్ మేథో సంపత్తి శ్రీలంక క్రికెట్ యాజమాన్యంలోనే కొనసాగుతుండగా వాణిజ్య మీడియా హక్కులు ఐపీజీ వద్ద ఉంటాయన్నారు. ఈ పరిణామంతో లీగ్ మరింత పారదర్శకంగా వాణిజ్య పరంగా బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు,లో ఛాయ్ విత్ జనసైనిక్



**– గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి**

**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** రాష్ట్ర జనసేన పార్టీ పిలుపుమేరకు కోవూరు మండలం కోవూరులో, మంగళవారం జనసేన ఐటీ విభాగం నేతల ఆధ్వర్యంలోఛాయ్ విత్ జనసైనిక్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోవూరు నియోజకవర్గ జనసేన నేత గాదిరాజు జీవన్ కృష్ణ,నక్కల శివకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆ ప్రాంతంలో ఛాయ్ తాగుతూ కార్యకర్తల సమస్యలను చర్చిస్తూ ఛాయ్ విత్ జనసైనిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత గాదిరాజు జీవన్ కృష్ణ మాట్లాడుతూ పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయాలను , ఆలోచనలను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఇటువంటి మంచి కార్యక్ర మానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర జనసేన పార్టీని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు శివకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని జనసైనికులతో వీరమహిళలతో కలిసి పార్టీ యొక్క సిద్ధాంతాలను, ఆలోచనలను గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు ఛాయ్ విత్ జనసైనిక్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. జనసేన సభ్యత్వం నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో నమోదు చేశామని, దీనికి సహకరించిన జనసేన నేత గాదిరాజు జీవన్ కృష్ణకు, సమిష్టిగా కృషి చేసిన జనసైనికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. జనసేన నాయకులు అమరనాథ్ సీహెచ్ సురేష్‌బాబు నియోజకవర్గ ఐటీ ఇన్‌చార్జి దిలీప్, సురేంద్ర, కళ్యాణ్, చైతన్య, సందీప్, వెంకటేశ్వర్లు, శరత్,, తనుష్ చంద్ర,, పెద్ద సంఖ్యలో జనసైనికులు ఉన్నారు.




## నెల్లూరులో 3వ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాసరావు మెంబర్ సెక్రటరీగా మంగళవారం 3వ టెలికాం అడ్వైజరీ కమిటీ 2024-26 సమావేశం జిల్లా బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో టెలికాం సేవల విస్తరణ, బీఎస్ఎన్ఎల్ సేవల మెరుగుదల, వినియోగదారులకు అందుతున్న సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ బలోపేతం తదితర అంశాలపై చర్చించామన్నారు. జిల్లాలో టెలికాం సేవలను మరింత మెరుగుపరచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన ఏ సమస్య తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ లాభాల బాటలో పయనిస్తుందన్నారు. రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నెల్లూరు జిల్లా బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ఉండడం సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ 49 కోట్ల లాభాల్లో ఉండడం సాధారణమైన విషయం కాదని, అందరి కృషితోనే ఇది సాధ్యమవుతుందన్నారు. బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ నుంచి కస్టమర్లు కొంతమంది ఇతర నెట్వర్కులకు మారుతున్నారని అలా ఎందుకు జరుగుతుందో చెప్పాలని, విలేకరులు అడిగిన ప్రశ్నకు జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాసరావు సమాధానం ఇస్తూ, ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ లాభాల బాటలో ముందుకెళ్తుందని, వినియోగదారులు నెట్వర్క్ మారుతున్న పరిస్థితులను పర్యవేక్షించి పరిష్కారం కనుగొంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు డీజీఎం (ఫైనాన్స్), సూపరిండెంట్ పిసి రాణి, ఏజిఎంలు పి శ్రీనివాసరావు, కె శ్యామల, సి భాస్కరయ్య, ఆర్. అశోక్ ఎస్‌డీఈ, వరప్రసాద్, ఎస్‌డీఈ, తదితరులు పాల్గొన్నారు.

## ఫిన్లాండ్ పర్యటనకు డాక్టర్ చెన్నయ్య



**బుచ్చి జూన్ 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన టీచర్లకు అంతర్జాతీయ శిక్షణ ఇచ్చే లక్ష్యంలో భాగంగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేయుచున్న డాక్టర్ చీదరాల చెన్నయ్యను ఫిన్ల్యాండ్ పర్యటనకు ఎంపిక చేశారు. ఫిన్ల్యాండ్ దేవ విద్యా పర్యటనకు ఎంపిక చేసి ఉపాధ్యాయులకు ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం 12 వ తేదిన విజయవాడలో ప్రారంభించారు. మొదటి దశలో తుర్కు విశ్వవిద్యాలయం సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇపిస్తున్నారు. రెండోదశలో ఆగష్టు 17 నుండి 26 వరకు బెస్ట్ టీచర్లు ఫిన్లాండ్ లోని తుర్కు, రౌమా నగరాల్లో పర్యటించి అక్కడ బోధన విద్యా విధానాలను పరిశీలించి మూడో దశలో.... పాఠశాలలో అమలు చేసే ప్రాజక్టుల కోసం యూనివర్సిటీ ఆఫ్ తుర్కు " ప్రొపెసర్లు టీచర్లు మార్గదర్శనం చేస్తారని ఈ బృహత్తర విద్యాకార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంతో సంతోషంగా ఉందని తనకు ఈ అవకాశం కల్పించిన విద్యాశాఖ మంత్రి వర్యులు నారాలోకేష్,జిల్లా విద్యాశాఖాధికారి బాలాజిరావు,మండల విద్యాశాఖాధికారులు దిలీప్‌కుమార్, వెంకటరత్నం, యం.బాస్కర్,పాఠశాలలోని తోటి ఉపాధ్యాయులు తదితరులు అందించిన ప్రోత్సహం వల్లనే ఈ గొప్ప అవకాశం లభించందని ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమ లక్ష్యాలను నూరు శాతం సాధించే దిశగా కృషి చేస్తానని డాక్టర్ చీదరాల చెన్నయ్య తెలియజేశారు. సాల్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వి.సతీష్‌రెడ్డి, ఎస్‌సిఇఆర్టి, సమగ్ర శిక్షణ సిబ్బంది తదితరులున్నారు.

## సందేహాలు ఉంటే వెంటనే సంప్రదించాలి



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు, పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాలను మంగళవారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బీఎల్వో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలు ఇచ్చి వారి చేత సంతకం చేయించుకుని వివరాలు పొందు పరచాలని సూచించారు. దీనిపై ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, వివిధ పార్టీల బీఎల్ఏలు, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

## రక్షిత నీటి పథకానికి మరమ్మతులు

**– ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా**



**కోవూరు, జూన్ 16ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని సర్వగ్రామ సచివాలయం-3 వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పైపు పూర్తిగా ధ్వంసమైంది. ఈ కారణంగా ఈ ఓహెచ్ఎస్ఆర్ పరిధిలోని చిన్న పడుగుపాడు, సత్యవతి నగర్, నేతాజీ నగర్, బండారుమాణ్యం ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే సలీమ్ యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి నాలుగు ప్రాంతాలకు రెండు ట్రాక్టర్లు పంపేలా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులు నీటి సమస్య లేకుండా ఊపిరి పీల్చుకున్నారు.

## ఉద్యానవన పంటలను ఆదుకోవాలి

**– డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి – సీపీఐ నాయకులు డిమాండ్**



**గూడూరు, జూన్ 16, ప్రభాతవార్త :** ఉద్యానవన పంటలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్‌లు పేర్కొన్నారు. గూడూరు పట్టణం లోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పక్షపాతి అనిచెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఉద్యాన వన రైతులను ఆదుకోవాలన్నారు. ఇప్పటికే వర్షాలు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెట్ట ప్రాంతాల రైతులు డ్రిప్ ఇరిగేషన్ మీదే ఆధారపడి పంటలను పండిస్తున్నారన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో రెండు వేల కోట్ల రూపాయలను డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కంపెనీలకు బాకాయిలను మంజూరు చేస్తే వారు రైతులకు సకాలంలో పరికరాలను అందచేస్తారన్నారు. ఇకనైనా ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పై దృష్టి సారించాలని, అదే విధంగా రైతులకు రాయితీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.నారాయణ, జితేంద్ర, రాజేష్, వినయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి అభివృద్ధిలో కీలక మలుపులు



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త – వైద్యం :** మూడో సారి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి ఎన్నికయ్యాక అభివృద్ధిలో కీలక మలుపులతో పరుగులు పెడుత ోందని నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని కస్తూరిదేవి మైదానంలో మంగళవారం నిర్వహి ంచిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయో త్సవ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనా రాయణ రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్ల తదితరులకు సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సర్వేపల్లిలో శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సారథ్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలపై ప్రత్యేక బుక్ లెట్‌ని విడుదల చేసి బుక్ లెట్లును అందజేసారు. పీ4లో సర్వేపల్లిలో చేపట్టిన కార్యక్రమాలను సవివరంగా వివరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులకు తోడైన సీఎస్ఆర్ ఫండ్‌తో గతంలో ఎప్పుడూ లేనివిధంగా సీఎస్ఆర్ నిధులు ప్రజలుసద్వినియోగం చేసుకున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. అలాగే పి 4 కార్యక్రమం ద్వారా మరింత అభివృద్ధి జరిగిందని తెలిపారు. విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా ప్రజాప్రనిధులతో కలసి సోమిరెడ్డి సందర్శించారు.

## రెండేళ్ల కూటమి పాలనలో ప్రగతి పథంలో రాష్ట్రం



**నెల్లూరు, జూన్ 16, ప్రభాతవార్త – వైద్యం :** రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు, ఉప ముఖ్యమంత్రి శ్రీపవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలులో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కూటమికి అధికారమిచ్చారన్నారు. నేడు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని అక్షరాల నిజం చేసి ఎంతో గర్వంగా వారి ముందుకు వచ్చామని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒకటో తేదీకల్లా అవ్వాతాతల చేతుల్లో పెన్షన్ పెడుతున్నామని, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఆర్థిక సాయాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని,"అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతు ఖాతాలో రూ.20 వేలు పడేలా చూస్తూనే, మత్స్యకార భరోసా రూ.20 వేలను కూడా అందిస్తున్నామని వివరించారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 200 పైగా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరుగుతాయన్నారు. పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దుతామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునకు అనుగుణంగా గ్రామీణ రోడ్ల రూపురేఖలు మార్చామని ప్రశాంతి రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం కొబ్బరికాయలు కొట్టి వదిలేసిన ముదివర్తి కాజ్వే, మల్దేవి డ్రైన్లను, అలాగే పీటర్స్ కెనాల్ బ్రిడ్జ్ వంటి ఎన్నో పనులను, కల్వర్టులను ఈ రెండేళ్లలోనే పూర్తి చేశామన్నారు. ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే దాదాపు రూ. 600 కోట్లతో రోడ్లు, ఇరిగేషన్, ఇతర మౌలిక వసతుల పనులను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రాబోయే మూడేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. యువనేత మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం భయం తీసేసి భవిష్యత్తును ఇస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ రెండేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల విలువైన ఫ్యాక్టరీలు, పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, ఇప్పటికే 6 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామన్న హామీని నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వం రాగానే దాన్ని పూర్తిగా రద్దు చేసిందన్నారు. నేడు ప్రతి రైతుకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందించి భూములపై పూర్తి హక్కులు కల్పించామన్నారు. గతంలో రీసర్వే పేరుతో రైతుల భూములను ఇష్టారాజ్యంగా నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చి ఇబ్బందులకు గురిచేశారని, ప్రస్తుత ప్రభుత్వం 22ఏ ఆంక్షలను తొలగించి మీ భూమి మీ హక్కు అనే నమ్మకాన్ని రైతుల్లో కల్పించిందన్నారు. నెల్లూరు జిల్లాలో సాధించిన 10 కి 10 అసెంబ్లీ స్థానాల విజయంతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా ప్రగతి పథంలో దూసుకుపోతోందని, రాబోయే రోజుల్లో ప్రజల అండదండలతో కూటమి ప్రభుత్వం నెల్లూరును మరింత అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను అతిథులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ



**గూడూరు, జూన్ 16, ప్రభాతవార్త :** గూడూరులోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో రోటరీ వెస్ట్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఉద్దేశంతో కుట్టు మిషన్లు ఇవ్వటం జరిగిందని అన్నారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిగిరిష్ మాట్లాడుతూ డిస్టిక్ గవర్నర్ ద్వారా వచ్చిన ఈ కుట్టు మిషన్లని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాఘవరెడ్డి, గోపాల్ రెడ్డి, వాసు గౌడ్, సనత్ రెడ్డి, నాసిన నాగులు, కృష్ణంరాజు, మూలి హరినాథ్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరి శ్రీనివాసులు, కోట కృష్ణ, గిరిబాబు, సిద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, పి. హరినాథ్ రెడ్డి బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీకి శాపంగా మారిన ఇటుక బట్టీ



**తోటపల్లి గూడూరు, జూన్ 16, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని ముక్కుంటమ్మ గిరిజన కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కాలనీ అంతటా వ్యాపించి ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తోందని చెబుతున్నారు. బట్టీ నిర్వహకులకు పలుమార్లు సమస్యను వివరించి చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ స్పందన లేకపోగా, తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బట్టీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోవడంతో పర్యావరణ కాలుష్యం మరింత పెరుగుతోందని వారు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు బయట ఆడుకునే సమయంలో అధికంగా వ్యాపిస్తున్న దుమ్ము, ధూళి వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మండల తహసీల్దార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు స్పందించి గిరిజన కాలనీ సమీపంలోని ఇటుక బట్టీని వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## మోర్ల జయంతిని పరామర్శించిన మాజీ మంత్రి ప్రసన్న



**బుచ్చి జూన్ 16 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ అద్యక్షురాలు మోర్ల జయంతిని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. 18 వవార్డు కౌన్సిలర్ మరియు వైసిపి విభాగం మహిళా అధ్యక్షురాలు మోర్ల జయంతి ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను బుచ్చిలోని 18 వవార్డులోని వారి నివాసానికి వెళ్ళి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు షేక్ షాహుల్, రూరల్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, మోర్ల భరత్ నాయకులు కందుకూరు యానాదిరెడ్డి, డాక్టర్ అల్లాబక్షు, కడివేటి శ్రీనివాసులురెడ్డి , కడివేటి అన్వేష్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, తాళ్ళ వెంకటేశ్వర్లు, కోరికల చంద్రశేఖర్, సయ్యద్ షామీర్ తదితరులున్నారు.